క్లుప్తంగా

టీకాల సమాచారంపై పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ నరసింహనాయక్ తదితరులు

కాకినాడ క్రైం: వ్యాధి నిరోధక టీకాల సమాచారంతో పాటు మీజిల్స్, రుగుళ్ల వ్యాధుల నిర్మూలన అంశాల సమాచార పోస్టర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ ఆవిష్కరించారు. డీఐఓ డాక్టర్ కేవీ సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏడు రకాల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. బాలింతలు, చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజల ఆరోగ్య సంరక్షణ నేపథ్యంలో విడుదల చేసిన పోస్టర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు. ఈ విషయాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేర్చాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందేనని తెలిపారు.

కరప ఎంపీడీఓగా కృష్ణగోపాల్



కరప: స్థానిక ఎంపీడీఓగా బులుసు కృష్ణగోపాల్ నియమితులయ్యారు. 2011 నుంచి 2014 వరకూ కరప మండల పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. తిరిగి ఉద్యోగోన్నతి పొంది ఎంపీడీఓగా వస్తున్నారు. ఇప్పటి వరకూ ఎంపీడీఓగా పనిచేసిన ఎం.అనుపమ డ్వామా విజిలెన్స్ అధికారిగా పదోన్నతిపై ఏలూరుకు వెళ్తున్నారు. సోమవారం కృష్ణగోపాల్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కాకినాడ లీగల్: జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నట్లు కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.ఆనంది ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్, ఇతర కేసులు పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపల్లి: వాకతిప్పలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శని, ఆదివారాల్లో విశాఖపట్నం అపోలో క్యాన్సర్ సెంటర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత క్యాన్సర్, తలసేమియా స్క్రినింగ్ నిర్వహించనున్నట్లు శిబిర నిర్వాహక సిబ్బంది శ్రీనివాస్ తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ శిబిరం జరుగుతుందన్నారు. దీనికి వచ్చేవారు పాత వైద్య రిపోర్టులు ఉంటే తీసుకు రావాలన్నారు.

కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి



తాళ్లరేవు అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డు సత్యనారాయణ

తాళ్లరేవు: మహాదాత, విద్యాప్రదాత మల్లాడి సత్యలింగ నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేసారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మాజీ ఎంపీపీ ఎంజీ సూర్యనారాయణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందించేందుకు తాను కష్టించి సంపాదించిన యావదాస్తిని దానం చేసిన సత్యలింగ నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని కోరారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, అగ్నికుల క్షత్రియ ఐక్య మహాసభ అధ్యక్షుడు వైదాడి నూకరాజు, అఖిలపక్ష నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్‌ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీఎం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ భవనం గోడపై మొక్కలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ భవనం గోడపై..



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ భవనం వెనుక అధ్వానంగా..

ఏమిట్రీ నిర్లక్ష్యం!

- ప్రభుత్వ భవనాల నిర్వహణ గాలికి
- పెరిగిపోతున్న పిచ్చి మొక్కలు
- ఫలితంగా శిథిలావస్థకు చేరుతున్న వైనం



కాకినాడ లీగల్: సొంతింటిని ఎంతో భద్రంగా చూసుకుంటాం.. కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. చిన్న సమస్య వస్తే వెంటనే బాగు చేయించుకుంటాం.. అదే ప్రజా సేవలు అందిస్తున్న ప్రభుత్వ భవనాలను మనకెందుకులే అన్నట్టు వదిలేస్తున్నారు.. ఫలితంగా అవి అధ్వానంగా మారడమే కాకుండా శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. చిన్న మొక్కే కాదా అని వదిలేయడంతో అవి పెద్దవై భవనం మనుగడకే ముప్పు తెస్తున్నాయి. ఇది తెలిసినా పట్టించుకునే వారే కరవయ్యారు. జిల్లా కేంద్రం కాకినాడలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాల పరిస్థితి ఇది. కొన్ని భవనాలు శిథిలస్థితికి చేరడంతో లోపల సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోంది. కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ భవనం వెనుక వైపు రావి మొక్కలు పెరిగిపోతున్నాయి. దీనివల్ల పైపు లైన్ గొట్టాలు పగిలిపోవడంతో నీరు బయటకు వచ్చి భవనం పాడవుతుంది. ఇక్కడి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఇది పాడుబడిన భవనంలా భయానకంగా కనిపిస్తోంది. **అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయ భవనంపై వివిధ రకాల మొక్కలు పెరిగిపోయాయి. భవనం శ్లాబ్‌లు, గోడలు బీటలు వారడంతో వర్షాకాలంలో నీరు కార్యాలయంలోకి వస్తుందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంటున్నారు. ఇక్కడి పరిస్థితిని చూసి ప్రజలు ముక్కున వేలేసు**కుంటున్నారు.

ఆదాయం వచ్చే చోట.. అవస్థలట

ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టే జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ నిర్వహణనూ గాలికి వదిలేశారు. కార్యాలయ భవనంపై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కనీస నిర్వహణ లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుతుంది. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు కార్యాలయంలోకి రావడంతో ఫర్నీచర్, దస్త్రాలు పాడైపోతాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పీఆర్ కళాశాలకు వివిధ రూపాల్లో ఆదాయం వస్తున్నప్పటికీ కళాశాల భవనాల నిర్వహణ లేకపోవడంతో మొక్కలు పెరిగిపోతున్నాయి. దీంతో భవనాలు శిథిలమయ్యే అవకాశం లేకపోలేదని పూర్వ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల నుంచి మార్పు తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాపాడే చర్యలు అవసరం



రూ.కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాలపై కనీస పర్యవేక్షణ లేక అధ్వానంగా తయారవుతున్నాయి. దశాబ్దాలు ఉండాల్సిన భవనాలు కొన్నేళ్లకే శిథిలావస్థకు చేరుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ప్రభుత్వ భవనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రజలకు ఉత్తమ సేవలు అందుతాయి.

– జీఎస్ఆర్ కృష్ణారావు, స్థానికుడు

మొక్కలు తొలగించండి



ప్రభుత్వ కార్యాలయ భవనాలపై పెరిగిపోయిన మొక్కలను తొలగించాలి. ఈ పిచ్చి మొక్కల కారణంగా భవనాలు శిథిలమవుతున్నాయి. శ్లాబ్‌లు పాడైపోవడంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. భవనాలపై పిచ్చి మొక్కలు తొలగించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు అవసరం.

– ఎస్‌వీవీ రమణ, స్థానికుడు

జీవన శైలిలో మార్పులు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కీళ్ల వ్యాధి నిపుణుడు నెక్కంటి మాధవ్

బోట్‌క్లబ్: జీవనశైలిలో మార్పులతో మోకాళ్ల నొప్పులు దూరం చేయవచ్చని కీళ్ల వ్యాధి నిపుణుడు నెక్కంటి మాధవ్ అన్నారు. స్థానికంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశాన్ని శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ మోకాళ్లకు బలాన్ని ఇచ్చే వ్యాయామాలు చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. మోకాళ్లపై అధిక బరువు పడటంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. బరువును నియంత్రించే చర్యలు చేపడితే ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన, కోశాధికారి ఉదయ చక్రవర్తి, సభ్యులు ముంజులూరి విశ్వేశ్వరరావు, లంక సాయిబాబు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో చిత్రలేఖన పోటీలు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో చిన్నారులకు పలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 14న సాయంత్రం ఐదు గంటలకు శ్రీకృష్ణ చిత్రలేఖన, అనంతరం భగవద్గీత పోటీలు, 15న సాయంత్రం 5 గంటలకు శ్రీకృష్ణ విచిత్ర వేషధారణతోపాటు, శ్రీకృష్ణుడికి సంబంధించిన క్విజ్ పోటీలు జరుపుతామన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 98666 94041 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.


రసాయనశాస్త్రం నూతన పరిశోధనలకు వేదిక



సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

బాలాజీచెరువు: రసాయనశాస్త్రం నూతన పరిశోధనకు వేదికగా నిలుస్తుందని స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు అన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్ ఇన్ క్యాథలిక్ సింథస్ ఆఫ్ స్మాల్ మ్యాలిక్యులర్స్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులో పాల్గొనడం ద్వారా నిష్ణాతులైన అధ్యాపకుల సందేశాలు, సూచనలు తెలుసుకోవచ్చన్నారు. ఇది భవిష్యత్‌లో విద్యార్థులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. ఐఐఎస్‌ఈఆర్ పూణే ప్రొఫెసర్ డీబీ రామాచారి, ఏఎన్‌యూ వర్సిటీ ప్రొఫెసర్ బి.జగన్‌మోహన్ రెడ్డి, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురుగన్, కన్వీనర్ సంజీవ్‌కుమార్, టీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న మరిడమ్మ వారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ వారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోసం..

బాలాజీచెరువు: ఆయనో విశ్రాంత అధ్యాపకుడు.. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా డాక్టర్ పాతూరి వెంకట కృష్ణారావు ఉంటూ ఉమ్మడి జిల్లా జాతీయ సేవా పథక కోఆర్డినేటర్‌గా పనిచేశారు. దాదాపు 300కు పైగా కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఏర్పాటు చేసి విద్యార్థులను సామాజిక సేవలో భాగస్వామ్యం చేశారు. వృత్తిని వదిలినా, 65 ఏళ్ల వయసులోనూ ఆయన ఆదివారం వస్తే చాలు.. నగరంలో ఏదో ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని అక్కడ పర్యావరణంపై అవగాహనతో పాటు ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ స్వచ్ఛంద సంస్థలో ,కాని కొంతమంది మిత్రులతో కలసి మొక్కల సంరక్షణతో పాటు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు. సముద్ర తీర ప్రాంతం, కళాశాలలు, యూనివర్సిటీ, హోప్ ఐలాండ్ ప్రాంతాలను శుభ్రం చేస్తున్నారు. కాకినాడ ఇంద్రపాలెం నుంచి సామర్లకోట వెళ్లే ప్రధాన రహదారి పక్కన మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. తన భార్య అన్నవరం సత్యవతీదేవి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించేవారు. ఆమె మృతితో స్మారకార్థం వృద్ధాశ్రమంలో అన్నదానం, వృద్ధులకు సహకారం అందిస్తున్నారు. పీఆర్ జూనియర్ కళాశాలలో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.1.50 లక్షతో అచ్యుతరామరావు, సీతయ్యమ్మ పేరుతో కళావేదిక ఏర్పాటు చేశారు.



ఆల్ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలసి పరిసరాలు శుభ్రం చేస్తున్న కృష్ణారావు

అవగాహన ఉండాలని..

పర్యావరణంపై యువతకు అవగాహన పెంచాలి. వచ్చే తరాలను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలు, కాలుష్యం పెరుగుదలతో నష్టాలు వివరించడమే నా జీవిత లక్ష్యంగా నిర్ణయించుకున్నా. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతలో భాగస్వామ్యం అవుతున్నా.

– డాక్టర్ పీవీ కృష్ణారావు, విశ్రాంత అధ్యాపకుడు

తప్పుడు ఫిర్యాదులు చేసి డబ్బు డిమాండ్



జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నేతలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఎస్సీ, బీసీ వర్గ ఉద్యోగస్తులే లక్ష్యంగా కొందరు తప్పుడు ఫిర్యాదులు చేయించి డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) కోఆర్డినేటర్ టి.చంగలరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులతో కలసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. డీఎల్‌పీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి, అభాగ్యులను ఇంటికి పిలిపించి వారి ద్వారా తప్పుడు ఫిర్యాదులు తయారు చేసి ఎస్సీ, బీసీ ఉద్యోగులను వేధిస్తున్నారన్నారు. దళిత ఉద్యోగులు మానసికంగా వేధింపులకు గురై సెలవు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే చట్టపరమైన అన్ని మార్గాల్లో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. దళిత గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు అన్నవరం, మాల మహానాడు పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షుడు మాతా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-19 విభాగంలో వివిధ పోటీలకు క్రీడాకారుల ఎంపికలు శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానం, పీఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎంపికలకు హాకీ విభాగంలో 80 మంది, స్విమ్మింగ్ విభాగంలో 50 మంది, రైఫిల్ షూటింగ్ విభాగంలో 30 మంది, ఫుట్కా విభాగంలో 20 మంది, వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో 150 మంది, పవర్ లిఫ్టింగ్ విభాగంలో 50 మంది, టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్‌లో బాలుర, బాలికలు ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో హాజరయ్యారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 కార్యదర్శి, రంచోడవరం పీడీ వెంకట రెడ్డి, శివరామకృష్ణ, రత్నశామ్యూల్, ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుధారాణి పర్యవేక్షించారు. వీటి నిర్వహణకు పీడీలు రవిరాజు, సునీల్, పట్టాభి, డీఎస్ఏ కోచ్‌లు సతీష్ కుమార్, సమీర్, సురేష్, అప్పలనాయుడు సహకారం అందించారు.

15న క్రీడాకారుల ఎంపికలు

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో ఈ నెల 15న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడా పోటీల్లో క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుధారాణి శుక్రవారం తెలిపారు. అండర్-14, 17 సాఫ్ట్ టెన్నిస్, జూడో, ఫుట్‌బాల్ అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికలు ఉంటాయని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు అర్హత దరఖాస్తులతో ఆ రోజు ఉదయం 8.30 గంటలకు డీఎస్ఏకు హాజరు కావాలని వారు కోరారు.



డీఎస్ఏలో అండర్-19 రైఫిల్ షూటింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు



కోనపాప పేటలో కోతకు గురైన తీర ప్రాంతం



గృహాల వద్దకు చొచ్చుకు వచ్చిన సముద్రపు నీరు



ఎంపీపీ పాఠశాల ఆవరణలోకి చేరిన నీరు

జీవన ఛిద్రం

- తీరంలో అలజడి
- నివాసాల వద్దకు చొచ్చుకొచ్చిన నీరు



కెరటాలకు ధ్వంసమైన బీచ్ రోడ్డు

కొత్తపల్లి: సముద్రంలో అలల కల్లోలం రేగింది.. వాతావరణ మార్పుల కారణంగా రెండు రోజుల నుంచి తీరంలో అలజడి కనిపిస్తుంది.. కెరటాల ఉధృతితో తీర ప్రాంత ప్రజల్లో భయం నెలకొంది.. ఉప్పాడ తీర ప్రాంతంలో బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన రాళ్ల గోడను సైతం దాటుకుని కెరటాలు ఎగసి పడడంతో గ్రామంలోకి నీరు వస్తోంది. ఉప్పాడ శివారు గ్రామాలైన రంగంపేట, సుబ్బంపేట, కొత్తపట్నంలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు, పాఠశాలలు, ఆలయాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో సమీపం నివాసాల వారు ఇబ్బంది పడుతున్నారు. ఉప్పాడ బీచ్ రోడ్డు ధ్వంసమైంది. పొన్నాడ శివారు కోనపాపపేటలో అలల ఉధృతి కారణంగా తీర ప్రాంత మత్స్యకారులు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



ఉప్పాడలో బీచ్ రోడ్డుపై ఎగసి పడుతున్న అలలు

బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: సీపీఎం అఖిల భారత కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం ఆయన ప్రథమ వర్ధంతిని సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, చల్లా విశ్వనాథం మాట్లాడుతూ ఏచూరి 1974లో ఎస్ఎఫ్ఐలో, తర్వాత ఏడాది సీపీఎంలో చేరారన్నారు. 2015 ఏప్రిల్ 19న విశాఖపట్నంలో నిర్వహించిన పార్టీ 15వ జాతీయ మహాసభల్లో సీపీఐ (ఎం)కు ఐదో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. ఏచూరి ఆశయాలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డి.సత్యనారాయణ, డి.కృష్ణ, కె.అప్పన్న, సిరపురపు మరిడయ్య, యాసలపు రమేష్, నరసింహమూర్తి, రొంగల వీర్రాజు, సూర్యనారాయణ, రమణ, సీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఎండపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో దివంగత సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.